# కలిసొచ్చిన చీకటి

అరుణ

''చూశావుగా నాయనా, ఇది మీ భాగం ఈ మధ్యలో అడ్డుపెట్టుకుంటే రెండు గదులవుతయి ముందు గది వంట గది పక్కనే స్నానాల గది ఉన్నది ''

ఇల్లుగల బామ్మగారు చెప్పుకుపోతున్నది అద్దెకు వచ్చిన లక్ష్మణరావు వింటున్నాడు

''మొన్ననే సున్నము అదీ కొట్టించాము దొడ్లో పంపు వుంది మీకు కావలసిన నీళ్లు ఒకసారే పట్టుకుని లోపల పెట్టుకోవాలి వేరే ఏంలేదు, ఇక్కడ పదికాపరాలున్నయ్యా— వాళ్లకి ఇబ్బంది కలుగకుండా — ఇకపోతే కరెంటుకి వేరే మీటరుంది ''

లక్ష్మణరావు ఒక చెవితో వింటున్నాడు అతని కళ్లు ఇంటిని పరీక్షగా చూస్తున్నాయి

''ఇంటికేం ? శుభ్రమైన ఇల్లు ముందు అచ్చొచ్చిన యిల్లు అవును, ఎంతమంద న్నావు ?''

''నేను, నా భార్యేనండి ఇద్దరం ''

''అలాగా, ఎన్నాళ్లయింది పెళ్లయి ?''

''ఎన్నాళ్ళేనా ? మొన్ననేనండి ఇంకా నెలకాలేదు ''

బామ్మగారు ఆపట్టున భళ్లున నవ్వేసింది

''అయితే అమ్మాయి కాపరానికి రాలేదన్న మాట ?''

''లేదండి, నాకీ వూరు కొత్త ఇల్లు చూశాక తీసుకొస్తాను ''

''శుభం చూడు నాయనా, నీ పేరేమిటన్నావు ?''

''లక్ష్మణరావండి ''

''అమ్మాయి పేరూ ?''

అతనికి చిరాకేసింది ఈ ఆరాలన్నీ ఎందుకో ?

''అంత సిగ్గెందుకు నాయనా ? రేపట్నించి పిలుస్తుంటే వినకపోతానా ?''

''అబ్బే, అదేంలేదండి ఊర్మిళ ''

''సరిగ్గా అతికిపోయింది నా ఇల్లని నేను చెప్పుకోటం కాదుగాని, ఈ యింట్లోకి వచ్చినవాళ్లు ఏడాది తిరక్కుండానే కొడుకునెత్తుకుంటారు, ప్రమోషను వస్తుంది''

అన్నది బామ్మగారు నిండుగా నవ్వుతూ

''అవునుగాని బామ్మగారు, ఈ ఇంట్లోకి గాలి వెలుతురు ఏమైనా వస్తయ్యా ?''

''అయ్యోరామ, ఎందుకు రావు ? ఈ యింట్లో వెనుక తాశీల్దారున్నాడు ఆయన్ని అదేదో వూరు, పెద్దదాన్ని మతిమరుపు వచ్చింది, అక్కడికి బదిలీచేశారు వెళ్లిపోతున్నప్పుడు నాదగ్గరకి వచ్చి ఎంత ఏడ్చాడనుకున్నావు ? బామ్మగారు మీ యింటిని విడిచి వెళ్లాలంటే బాధగా వుందండి — అని ఒకటే ఇదయినాడు అతని భార్య అచ్చు శ్రీమహాలక్ష్మే ననుకో అత్తయ్యగారు, మేము మళ్లీ వస్తే మీ ఇల్లే మాకివ్వాలన్నది నలుగురాడపిల్లల తరువాత ఈ ఇంట్లోకి వచ్చాక పుట్టాడు మగపిల్లవాడు ''

''అలాగా, మీరొక పని చేయవలసింది బామ్మగారు పిల్లలు లేనివాళ్లకి మీ ఇల్లు అద్దెకిచ్చి ఇంత అని వసూలుచేస్తే మీకింకా డబ్బు వచ్చేది మీ ఇల్లు పెద్ద యాత్రాస్థలమైపోయేది ''

బామ్మగారి ముఖంలో నవ్వు మాయమైంది అయితే అంత తొందరగా ఓటమి నంగీకరించే మనస్తత్వం కాదామెది

''నిజమో కాదో వుండిచూడు తెలుస్తుంది అయితే అమ్మా నాన్నా ఎక్కడ వున్నారు ?''

''వాళ్లంతా అన్నయ్య దగ్గరున్నారు ''

''మంచిది నాయనా ''

''ఇంతకు అద్దె ఎంతో చెప్పారుకారు ?''

''యాభయిరూపాయలు ''

''యాభయిరూపాయలే !''

''అన్నమాటేగాని ఈ రోజుల్లో ఏం వస్తున్నయి ? కొనబోతే కొరివి అమ్మబోతే అడివి మొన్న సున్నం కొట్టిస్తే వంద రూపాయలైంది ''

''అంతయితే నేను భరించలేను ''

బామ్మగారు నలభై అయిదుకు తగ్గింది ఇక తగ్గనంది పర్సు తీసి మాట్లాడకుండా డబ్బు ఇచ్చాడు —

''వస్తా బామ్మగారు, మంచిరోజు చూసి గృహప్రవేశం చేస్తా ''

''శుభం '

* * *

ఇంట్లో దిగాకా

''నాకీ ఇల్లు ఏమీ బాగలేదు ''

అన్నాడు లక్ష్మణరావు

అప్పటికి ఊర్మిళ వచ్చి పదిరోజులయింది ఈ పదిరోజులలో ఊర్మిళ బామ్మగారి కూతురయిపోయింది

''ఎందుకు బాగలేదు ? మీరేకదా కుదిర్చింది ?''

అంది ఊర్మిళ

''ఎందుకేమిటి నీ మొఖం ? చూడు గాలి, వెలుతురు ఏమైనా వస్తున్నయ్యా ? పగలు కూడా లైటు వేసుకోవాలి రాత్రిళ్ళు సరేసరి ''

''నిన్న పైకివెళ్ళి పడుకుంటిరిగా '' అంది కొంటెగా

''రోజూ అలా పడుకోమనా తమరి సలహా''

ఊర్మిళ బలవంతాన నవ్వు ఆపుకుంది

''ఇంట్లోకి గాలి రాదు విపరీతమైన చెమట దోమలు వాటికి నా రక్తం అంత ఇష్టంకాబోలు ఒక పౌను తాగేసినయి ''

ఊర్మిళ నవ్వు ఆపుకోలేకపోయింది

''కప్పుకోండి ''

''అసలే చెమటంటుంటే ''

''మరేం చేస్తారు ?''

''నువ్వు పైకి రా ''

''వచ్చానుగా '' అంది హేళనగా

''అవును వచ్చావు వచ్చీరాగానే పన్నెండు జతల కళ్ళు మనమీదికి తిరిగినయి ఏమిటమ్మా పబ్లీకుగా సరసాలు అని విమర్శలు సరిగా వీధి దీపం అక్కడే వేశారు డాబా అంతా వెలుగు పైగా వాళ్ళందరు నిన్ను చూస్తుంటే నాకు తేళ్ళు, జెర్రులు పాకినట్లుంటుంది ''

ఊర్మిళ కీ ధోరణికి నవ్వు వస్తున్నది

లక్ష్మణరావుకి ఆగ్రహం కట్టలు తెంచుకుంది

''ఏమైనాసరే తేల్చేస్తాను '' అన్నాడు జుట్టు పీక్కుంటూ

''అయ్యొయ్యొ, ఆ జుట్టునేం చేయకండి ముందు కాఫీ తాగండి ఆ జుట్టుని చూసి నేను మిమ్మల్ని ప్రేమించాను ''

''చస్తే తాగను ఇప్పుడు నేను వినకూడని మాట విన్నాను ముందామాటని

ఉపసంహరించుకో నా జుట్టుని చూసి ప్రేమించావా ? అయితే ఈ జుట్టునే గొరిగించి దగ్గర పెట్టుకో ఇక నేనెందుకు ?''

''ఆదా మీ కోపం ?'' అని వెనకనించి వచ్చి మెడచుట్టూ చేతులువేసి వీపులో ముఖం దాచుకుంటూ, ''ఆ జుట్టువలన మీ ముఖాని కెంత అందము వచ్చిందో తెలుసా?'' అంది సిగ్గుతో సగం మాటలు మింగుతూ

లక్ష్మణరావు నిలువునా కరిగిపోయాడు చప్పున చెయ్యిపట్టి లాక్కున్నాడు ఆమె జాజిపూలమాలలా అతని ఒళ్ళోపడింది

''ఊర్మిళా, ఆఫీసులో ఏ పని చేస్తున్నా నీ మీదకేపోతుంది మనసు ఎప్పుడు అయిదవుతుందా ? ఎప్పుడు రెక్కలు కట్టుకుని ఇక్కడ వాల్దామా అని ఆరాటం తెలుసా?''

ఊర్మిళ తెలియదన్నట్లు కళ్ళు మూసుకుని తల ఆడించింది

''నీకేం తెలుసు మగవాడి బాధ ?'' అన్నాడు జాలిగా ముఖంపెట్టి

''అవునవును, మహా బాధపడిపోతున్నారు పాపం !'' అంది నవ్వుతూ

లక్ష్మణరావు ముగ్ధుడై ఊర్మిళవంక తదేకంగా చూస్తూ కూర్చున్నాడు

''ఏమిటలా చూస్తున్నారు ?'' అంది సిగ్గుగా

''ఊర్మిళా నన్ను ఇలా పరవశింపచేయటానికి నేనేం పుణ్యం చేశాను ''

''ఇలా నన్ను మీ గుండెలో దాచుకోటానికి మీకన్నా ఎక్కువ పుణ్యమే చేశాను నేను ''

నాలుగు పెదవులు విడిపోయాక, ''వదలండిబాబు, మళ్ళీ వంట కాలేదని విసుక్కుంటారు '' అంటూ లేచింది

లక్ష్మణరావు ఊర్మిళని వదిలేశాడు వదిలేసి వెనక్కి తిరిగిచూసి ఉలిక్కిపడ్డాడు అక్కడ ఆరోకాపరపు పిన్నిగారు నిల్చొనిఉంది!

ఎంతసేపట్నించి ఉందో ?

''ఏంలేదమ్మా, కాస్త కాఫీపొడి ఇస్తావేమోనని—''

''రాత్రిళ్ళే ననుకున్నా పగలు కూడా మమ్మల్ని సుఖపడనీయరు ఏమైనాసరే, ఈ దోమల్లో, ఈ ఉక్కలో పడుకోటం కష్టం తేల్చాలి '' అనుకున్నాడు పళ్ళు కొరుకుతూ

* * *

రాత్రి ఎనిమిదయింది !

లక్ష్మణరావు ముందుగదిలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు అతని మెదడు మహా వేగంతో ఆలోచిస్తున్నది

అతని ఆలోచనలని చెదరగొడుతూ వచ్చింది విద్యార్థుల ఊరేగింపు

''ప్రిన్సిపాల్''

''డౌన్ డౌన్''

''నిరంకుశత్వం ''

''నశించాలి ''

''స్టూడెంట్ లీడర్ కాశ్యప్''

''జిందాబాద్ ''

''ప్రిన్సిపాల్''

''డౌన్ డౌన్''

ఎంతమంది ! పదులు వందలు, వందలు బారులుగా పోతున్నారు ఆ ప్రాంతమంతా కేకలతో, అరుపులతో మార్మోగిపోతున్నది లక్ష్మణరావు ముఖంలో రంగులు మారినయి అతనికి ఆ రాత్రి సుఖంగా నిద్ర పట్టింది


* * *

''చూశారా లక్ష్మణరావుగారు, మనింటి ముందు బల్బుని ఎవరో పగలగొట్టారు చక్కగా లైటుంది చదువుకోవచ్చుగదా అనుకున్నా '' అన్నాడో వాటాదారు

''ఎవరు ? పగులగొట్టారంటారూ ?''

''ఎవరేమిటండీ, విద్యార్థులే రాత్రి చూశారుగా ఎంతమందో ? వాళ్ళ పనే ఇది అబ్బబ్బ ! ఒక్కళ్ళకి ఇది మనది దీంట్లో

(56 వ పేజీ చూడండి)





## కలిసొచ్చిన చీకటి

(25వ పేజీ తరువాయి)

నా భాగంకూడా ఉంది అనే భావం లేనే లేదండి. ఏం చదువులో ఏమోను? బల్బ్ పగలగొడితే మళ్ళా ఎవరు వేస్తారు చెప్పండి? ఏడాదయినా దిక్కుండదు."

"అంతేనండి."

"నిన్న అక్కడ లారీచార్జి జరిగిందట. ఇవ్వాళేం జరుగుతుందో?"

"అవునండి. రోజులలా వున్నాయిమరి."

ఆ రాత్రి లక్ష్మణరావు సతీసమేతంగా పైకెళ్లి పడుకున్నాడు.

"కాగల కార్యం గంధర్వులే సాధించారని—మొత్తానికి విద్యార్థులు మీకు మేలేచేశారు." అంది ఊర్మిళ నవ్వుతూ.

"ఏమిటుమాత్రం?"

"పోండి."

"ఎక్కడికి? ఇంత రాత్రిలో, అందులో నిన్ను విడిచిపెట్టి, నాకేం, నువ్వొక్కదానివి వుండలేవమ్మాయ్."

ఊర్మిళ నవ్వుకుంది.

"నీకో రహస్యం చెప్పనా?" భర్త గుస గుస.

"చెప్పండి." భార్య ఆశ్చర్యం.

"ఆ బల్బ్ పగలగొట్టింది విద్యార్థులు కారు." అన్నాడు భర్త గర్వంగా.

"మరి!" భార్య అడిగింది సందేహంగా.

"నేను." అన్నాడు అతిరహస్యంగా

"మీరా? తప్పుకాదూ?"

"ఏంచేయను, నీకోసరం—"

"ఊఁ!"

"నాకోసరం."

"ఊహూఁ"

"మనకోసరం."

ఊర్మిళ మురిపెంగా అతని చెవులు పట్టుకుని,

"అయితే శిక్ష ఏమిటో తెలుసా?" అంది.

"తెలుసు. ఇది." అన్నాడు ఆమెని దగ్గరగా లాక్కుని.

# అగ్నిలేక దహించేది



ధర్మపథం

బులుసు వేంకట రమణయ్య

దహించే స్వభావం అగ్నికి సర్వసాధారణమైనది. అది మానవుని శరీరాన్ని దహించ గలదు. కాని, మనస్సును దహించే శక్తి దానికి లేదనే చెప్పవచ్చును. ఏమంటే- కొందరు కారణాంతరాలవల్ల మనఃపూర్వకంగానే అగ్నికి ఆహుతి అవుతూ ఉంటారు. అట్టి అగ్ని లేకుండానే మనస్సునే దహించే సంఘటనలు కొన్ని సుప్రసిద్ధాలయి ఉన్నవి. అవి అగ్ని కంటెనూ మహాశక్తివంతములు. అగ్ని శరీరాన్ని దహింపజేస్తుంది కాని, యివి మనస్సునే దహింపజేస్తాయి.

"భార్యావియోగశ్చ జనాపవాదో
ఋణస్య శేషః కుజనస్య సేవా,
దారిద్ర్యకాలే ప్రియదర్శనం చ
వినాగ్నినా పంచ దహంతి చిత్తమ్."

భార్యావియోగం, జనులలో నిందపడడం, అప్పు మిగిలిపోయి ఉండడం, చెడ్డవారిని సేవించడం, తాను లేమిని అనుభవిస్తున్న సమయంలోనే మిత్రులను చూడవలసి ఉండడం—అనే ఈ అయిదున్నూ, అగ్ని లేకుండానే మనిషిని దహించివేస్తాయి.

భార్యావియోగమంటే—భార్యను విడిచి దూరదేశంలో ఉండడంగాని, భార్య మరణించి ఉండడం కాని కావచ్చును. మనుష్యులను బాధ పెట్టడంలో దానిని మించినది లేదు. దానివల్ల కలిగే తాపం అతీతమయింది.

ఇతరులు తన్ను నిందిస్తే సహించలేక పోవడం స్వభావం. తానేదయినా తప్పు చేస్తే—నింద వచ్చినప్పుడు కొంతవరకయినా సహించ వచ్చును. కాని, లేనిపోని నిందలు—నిష్కారణంగా అపవాదులు వచ్చినప్పుడు ఒళ్లు మండడం, మనస్సుకు తీరని తాపం కలగడం ఎంతో సహజం.

ఋణం అంతా తీర్చివేసి, కొద్దిగామాత్రం మిగిల్చి ఉంచినట్లయితే అదే పెరిగి పెద్దదయి ఉపద్రవం కలిగిస్తుంది. ఇది వ్రణం వంటిది. "ఋణశేషం, వ్రణశేషం ఎంతమాత్రం ఉండ కూడదు" అనేది దీనిమూలంగానే ఏర్పడింది. ఋణం పూర్తిగా చెల్లితేనే గాని నెమ్మది ఉండదు.

చెడ్డవాడిదగ్గర నౌకరీ చేయడమున్నూ ఎంతో కష్టం. ప్రతీ చిన్నవిషయంలోనూ యజమాని కసురుతూ ఉంటే సహించడం ఎంతో కష్టం. మనస్సు ఉడుకుతున్నా, జీవనంకోసం అట్టివాని దగ్గర పనిచెయ్యడం తప్పనిసరిగా ఉంటుంది.

తాను తీరని దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నప్పుడు తన దగ్గరకు ఆప్తులైన మిత్రులు వస్తే, వారిని తగినట్లు చూడడానికి శక్తి లేనందువల్లా, గౌరవించడం విధి కావడం వల్లా ఏమి చెయ్యడానికీ తోచక మనస్సు మిక్కిలి బాధపడుతుంది. అప్పుడు కలిగే తాపం చెప్ప సాధ్యం కానిది.

## హైదరాబాదు నోట్‌బుక్

(7వ పేజీ తరువాయి)

వారసుడు ఆయన నిరంతర జపం భారత్ గుణ వర్ధక్ సంస్థ— ఎన్ని ప్రభుత్వోద్యోగాలు చేసినా, ఎన్ని పూర్ణ ఉద్యోగాలిత్తా తిరిగినా ఈ సంస్థ శాలిబండలో 1895 మార్చి 27 న స్థాపితమైంది. ప్రస్తుతం ప్రపంచంలోని భాషాకోశాలు, భాషా శాస్త్ర గ్రంథాలతో సహా దాదాపు 30 వేల తెలుగు, హిందీ, మరాఠీ, ఉరుదూ, సంస్కృతాంధ్ర గ్రంథాలున్నాయి. మంగళ కార్యాలయం, వ్యాయామశాల, కిశోర కేంద్ర, మహిళా విభాగ్, రిక్రియేషన్ క్లబ్బు, సంఘ సేవాశాఖ, విద్యార్థిశాఖ- అనే వివిధ శాఖలు నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాల కంతా జీవనాడి మహబూబ్‌నారాయన్. ఆయన ఉరుదూలో గొప్పవక్త, భారతదేశ ఉరుదూ మహావక్తలలో ఒకరు. ఆయన ప్రసంగంలో నిమిష నిమిషానికి ఒక చలోక్తి రాలవలసిందే, శ్రోతలు నవ్వవలసిందే. మహాసుందరమైన ఉరుదూ స్టైలి ఆయనది. ఆంధ్రప్రదేశ్ పరిశోధకులు ఈ గ్రంథాలయాన్ని పూర్తిగా వాడుకోవాలని ఆయన ఆశ. "నేను డెభ్భయి సమీపిస్తున్నాను. మంచి జిజ్ఞాసువు నకు వారసుడు కావాలని నా ఆశ" అన్నారు ఆయన.

**Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikariunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna**